సాక్షి
పశ్చిమగోదావరి

శనివారం । 19 । అక్టోబర్ । 2024



గురువులకు ప్రత్యేక శిక్షణ

జాతీయ విద్యావిధానం - 2020కి అనుగుణంగా ఉపాధ్యాయులకు ప్రత్యేక రెసిడెన్షియల్ విధానంలో శిక్షణ ఇచ్చేందుకు విద్యా శాఖ ఏర్పాట్లు చేసింది. 8లో ▸



మద్యం దుకాణం మూసివేత

లింగపాలెం శివారు బుల్లవారిగూడెం సమీపంలో మద్యం దుకాణాన్ని స్థానికుల ఆందోళన నేపథ్యంలో తాత్కాలికంగా మూసివేసినట్లు ఎక్సైజ్ అధికారులు తెలిపారు. 8లో ▸



చోరీ కేసులో నిందితుడి అరెస్ట్

నరసాపురం పట్టణంలోని ఈనెల 1న జరిగిన చోరీ కేసును పోలీసులు ఛేదించారు. రూ 1.43 లక్షలు విలువ చేసే 70.47 గ్రాముల బంగారు నగలు స్వాధీనం చేసుకున్నారు. 8లో ▸

న్యూస్‌రీల్

ఇసుక, మద్యం విధానాలతో అవస్థలు



వంక రవీంద్రనాథ్, ఎమ్మెల్సీ

తణుకు: కొత్త ప్రభుత్వం అట్టహాసంగా ప్రారంభించిన పథకాలు ప్రజలకు భారంగా మారాయని ఎమ్మెల్సీ వంక రవీంద్రనాథ్ విమర్శించారు. శుక్ర వారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. ఇసుక విధానంలో స్పష్టత లేకుండా చేసిన ప్రభుత్వం ఆన్‌లైన్ విధానంలో అనేక మతలబులు పెట్టి సాధారణ పౌరులకు అవకాశం లేకుండా చేశారన్నారు. ఇసుక లేకపోవడంతో భవన నిర్మాణ కార్మికులకు పనులు లేక అవస్థలు పడుతున్నారని ఆరోపించారు. ఎంతో ఆర్భాటంగా ఏర్పాటు చేసిన మద్యం షాపుల్లో ఎమ్మార్పీ కంటే ఎక్కువకు అమ్ముతున్నారని చెప్పారు. గోదావరి జిల్లాల్లో షాపులు దక్కించుకున్న వారిని స్వేచ్ఛగా వ్యాపారం చేసుకోనివ్వడం లేదన్నారు. ప్రభుత్వం తక్షణమే ఈ రెండు పథకాలపై ప్రజలకు అసౌకర్యం కలగకుండా చర్యలు తీసుకోవాలని కోరారు.

ప్రజలపై విద్యుత్ భారం



విద్యుత్ సబ్ స్టేషన్ వద్ద సీపీఎం ధర్నా

భీమవరం: ఇంధన సర్దుబాటు, ట్రూ అప్ చార్జీల పేరుతో సుమారు రూ.20 వేల కోట్లు ప్రజలపై భారం వేస్తే ప్రజా ప్రతిఘటన తప్పదంటూ సీపీఎం ఆధ్వర్యంలో భీమవరం విద్యుత్ సబ్‌స్టేషన్ ఆఫీస్ వద్ద ధర్నా నిర్వహించారు. సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు చింతకాయల బాబురావు మాట్లాడుతూ ఒక్క రూపాయి కూడా విద్యుత్ చార్జీలు పెంచమని చెప్పిన చంద్రబాబు విద్యుత్ సంస్థల ప్రతిపాదన అంగీకరించడానికి సిద్ధపడటం తీవ్రంగా తప్పుపట్టారు. ఇంధనం సర్దుబాటు పేరుతో ప్రజలపై భారం వేయడం దారుణమన్నారు. భీమవరం విద్యుత్తు సబ్‌స్టేషన్ ఏఈ వర్మకు సమస్యలతో కూడిన వినతి పత్రాన్ని అందించారు.

వాసవీ మాతకు విశేష పూజలు



కర్ణాటక నుంచి వచ్చిన వాసవీ భక్తులు

పెనుగొండ: కర్ణాటక శివమొగ్గ(షిమోగా)లో వాసవీ అమ్మవారి ప్రతిష్ఠాపన చేసి 100 సంవత్సరాలు పూర్తయిన సందర్భంగా శత మహోత్సవం వేడుక సంకల్ప పూజలు పెనుగొండ వాసవీ శాంతి ధాంలో భక్తి శ్రద్ధలతో నిర్వహించారు. 100 మంది పైగా భక్తులు కర్ణాటక నుంచి అఖిల భారత శ్రీవాసవీ పెనుగొండ ట్రస్ట్ ఆధ్వర్యంలోని వాసవీ శాంతి ధాంకు శుక్రవారం తరలి వచ్చారు. ఈ సందర్భంగా కర్ణాటక ఎమ్మెల్సీ డి.అరుణ్ దంపతులు ముఖ్య అతిథిగా పాల్గొని పూజలు నిర్వహించారు. ఉదయం నుంచి గోమాత పూజ, పంచామృతాభిషేకాలు, దంపతుల పూజలు నిర్వహించారు.

సార్వత్రిక విద్యాపీఠం ప్రవేశాల గడువు పొడిగింపు

భీమవరం: ఆంధ్రప్రదేశ్ సార్వత్రిక విద్యా పీఠానికి సంబంధించి ప్రస్తుత విద్యాసంవత్సరానికి టెన్త్, ఇంటర్ కోర్సుల్లో ప్రవేశానికి ఈ నెల 31 వరకు గడువు పొడిగించినట్లు జిల్లా విద్యాశాఖాధికారిణి జి.నాగమణి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఫైన్ లేకుండా ఫీజు చెల్లించడానికి ఈ నెల 25 వరకు గడువు ఉందన్నారు. రూ.200 ఫైన్‌తో ఈ నెల 26 నుంచి 29 వరకు, రూ.500 ఫైన్‌తో ఫీజు చెల్లించడానికి ఈ నెల 30, 31 తేదీల్లో అవకాశముందని తెలిపారు.

సీహెచ్‌సీకి మందులు

సాక్షి స్పందన

దెందులూరు: సాక్షిలో ప్రచురితమైన 'మందు ల్లేవ్' కథనానికి ప్రభుత్వం స్పందించింది. నెల రోజులుగా దెందులూరు సీహెచ్‌సీకి మందులు లేకపోయినా జిల్లా అధికారులు, కూటమి ప్రభుత్వం పట్టించుకోలేదు. దీనిపై సాక్షిలో వచ్చిన కథనానికి స్పందించింది. దెందులూరు సీహెచ్‌సీకి మందులు సరఫరా చేశారు. సమస్య పరిష్కారానికి కృషి చేసిన సాక్షికి నియోజకవర్గంలోని ప్రజలు, బాధితులు కృతజ్ఞతలు తెలిపారు.

20న ఖోఖో సెలెక్షన్స్

దెందులూరు: 43వ రాష్ట్ర స్థాయి బాలబాలికల ఖోఖో జట్ల ఎంపిక కోసం ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లాకు సంబంధించి ఈ నెల 20న ఉదయం 10 గంటలకు టీ.నర్సాపురం మండల బొర్రంపాలెం జెడ్పీహెచ్ స్కూల్లో ఎంపిక పోటీలు జరుగుతాయి.



అశేష భక్తజన సందోహం నడుమ శ్రీవారి దివ్య రథయాత్ర

వైభవంగా రథోత్సవం

నేడు చక్రస్నానం, ధ్వజావరోహణం



క్షేత్ర పురవీధుల్లో ఉభయ దేవేరులతో..



రథం వద్ద బలిహరణ సమర్పిస్తున్న ఆలయ ఈఓ



శ్రీ వేంకటేశ్వర స్వామివారి వేషధారణ

ద్వారకాతిరుమల: అఖిలాండకోటి బ్రహ్మాండనాయకుడిని కనులారా వీక్షించిన వారిదే కదా పుణ్యము.. దివ్య రథంపై విహరించిన శ్రీవారిని దర్శించిన వారి జన్మ ధన్యము. ద్వారకాతిరుమల క్షేత్రంలో శ్రీవారి ఆశ్వయుజమాస దివ్య బ్రహ్మోత్సవాలు కనులపండువగా సాగుతున్నాయి. శుక్రవారం రాత్రి స్వామివారు ఉభయ దేవేరులతో కలసి దివ్య రథంపై క్షేత్ర పురవీధుల్లో అట్టహాసంగా ఊరేగారు. ఆలయ ముఖ మండపంలో శ్రీవారు రాజమన్నార్ అలంకారంలో భక్తులకు దర్శనభాగ్యాన్ని కల్పించారు.

రథోత్సవ వేడుక : ముందుగా ఆలయంలో అర్చకులు స్వామి, అమ్మవార్లను తొళక్క వాహనంపై ఉంచి, పూజాదికాలు నిర్వహించారు. అనంతరం మేళతాళాలు, మంగళ వాయిద్యాలు, కోలాట భజనలు, అర్చకులు, పండితులు, ఆగమ విద్యార్థుల వేద మంత్రోచ్ఛరణల నడుమ వాహనాన్ని రథం వద్దకు తీసుకొచ్చారు. రథంలో ఏర్పాటు చేసిన సింహాసనంపై కల్యాణ మూర్తులను వేంచేపు చేసి, పుష్పాలంకారాలు చేసి హారతులిచ్చారు. ఆలయ చైర్మన్, ఈఓ తదితరులు పూజలు నిర్వహించి బలిహరణ సమర్పించారు.

ఊరూవాడా బెల్ట్ షాపులే!

- షాపును బట్టి రూ.50 వేల నుంచి రూ. 2 లక్షల వరకు డిమాండ్
- ప్రజాప్రతినిధుల సిఫార్సు తప్పనిసరి
- మరోవైపు జనావాసాల మధ్య షాపులకు అభ్యంతరాలు
- షాపులు దొరక్క ప్రారంభం కాని వైన్‌షాపులు



తాడేపల్లిగూడెంలో టెంట్‌లో ఏర్పాటు చేసిన మద్యం షాపు



కొమ్మరలో మద్యం షాపు

సాక్షి ప్రతినిధి, ఏలూరు: వైన్ షాపుల పంచాయితీ కొలిక్కి రాక ముందే బెల్టుషాపుల లొల్లి తారాస్థాయికి చేరింది. సగటున గ్రామ జనాభాను ప్రాతిపదికను తీసుకుని రూ.50 వేల నుంచి రూ. 2 లక్షలు అడ్వాన్స్‌లు డిమాండ్ చేస్తున్నారు. ఈ బెల్ట్ షాపులకు ప్రజాప్రతినిధుల ఆమోదముద్ర ఉండాల్సిందే. బెల్టు నిర్వాహకులు కూటమి పార్టీకి చెందిన మనిషై ఉండాలి. వైన్‌షాపులకు సిండికేట్ల పంచాయితీల కంటే బెల్టుషాపుల వ్యవహారంలో ప్రజాప్రతినిధులు ఎక్కువగా తలమునకలైపోయారు. మరోవైపు మొదటి రోజు నుంచి మద్యంను అధిక ధరలకు విక్రయించారు. క్వార్టర్‌కు రూ.20, ఫుల్‌కు రూ. 80 చొప్పున అధికంగా వసూలు చేశారు. ఏలూరు జిల్లాలో 144 వైన్‌షాపులకుగాను 124, పశ్చిమగోదావరిజిల్లాలో 175 వైన్‌షాపులకుగాను 167 షాపులు ప్రారంభమయ్యాయి. ఇక ప్రతి వైన్ షాపుకు అనుబంధంగా పదుల సంఖ్యలో బెల్టు షాపులు ఏర్పాటు చేయాలని అధికార పార్టీ నిర్ణయించింది. నియోజకవర్గంలో గ్రామాల సంఖ్యను బట్టి బెల్టుషాపులు ఏర్పాటు చేస్తే డిమాండ్, ఆదాయం అధికంగా ఉంటుందని నిర్ణయించారు. ఈ క్రమంలో బెల్టుషాపుల పంచాయితీ ప్రారంభమైంది. షాపులు కచ్చితంగా టీడీపీ వాళ్ళకే ఇవ్వాలని మండల నేతల నుంచి ఒత్తిడి ఉన్న క్రమంలో ఒక్కొక్క చోట ఒక్కో పద్ధతికి తెరతీశారు. కొన్ని నియోజకవర్గాల్లో బెల్టుషాపులకు అనధికార వేలం పాట, లేదా లాటరీ నిర్వహించేలా చర్చలు సాగిస్తున్నారు. చింతలపూడి, పోలవరం, దెందులూరు, కై కలూరు, ఉంగుటూరు నియోజకవర్గాల్లో రూ. 50 వేల నుంచి 2 లక్షల వరకు అడ్వాన్స్‌లు తీసుకుని ప్రజాప్రతినిధులతో సిఫార్సు చేయించుకుంటున్నారు. ఉంగుటూరు నియోజకవర్గ ఎమ్మెల్యే జనసేన అయినప్పటికీ 80 శాతానికి పైగా బెల్టుషాపులు టీడీపీ శ్రేణులకే అప్పగించాల్సిన పరిస్థితి. నియోజకవర్గంలో 84 గ్రామాలకు ఇప్పటికి 50కుపైగా బెల్టుషాపులు ప్రారంభమయ్యాయి. ఆచంట నియోజకవర్గంలో 80కుపైగా బెల్టుషాపులు కొనసాగుతున్నాయి. తాడేపల్లిగూడె, తణుకు, ఉండిలో పాత బెల్టుషాపుల్లో పాత మద్యమే కొనసాగుతుంది.

ఇంకా ప్రారంభంకాని షాపులు

మరోవైపు జిల్లాలో దెందులూరు నియోజకవర్గంలో 21 షాపులకుగాను 9 షాపులే ప్రారంభమయ్యాయి. సిండికేట్ తేలకపోవడం, షాపుల పెట్టుబడుల వ్యవహారాలు పూర్తి కాకపోవడంతో నిలిచిపోయాయి. ఏలూరులోనూ 4 షాపుల ఏర్పాటులో అడ్డంకులున్నాయి.

టెంట్‌లు ఏర్పాటు చేసి మరీ..

ఏలూరు, పశ్చిమగోదావరి జిల్లాల్లో జనావాసాల మధ్య మద్యం షాపుల ఏర్పాటుపై ప్రజల నుంచి తీవ్ర వ్యతిరేకత వ్యక్తమవుతుంది. అధికార పార్టీ నేతలు బలవంతంగా షాపుల ఏర్పాటుకు యత్నిస్తున్నప్పటికీ ప్రజలు అడ్డుకుంటున్నారు. ఈ పరిస్థితి తాడేపల్లిగూడెం, ఉండి, భీమవరం, నర్సాపురం, ఏలూరు, కైకలూరులో ఉంది. దీంతో పశ్చిమగోదావరి జిల్లాలో తాత్కాలిక లైసెన్స్ పేరుతో రోడ్ల వెంబడి టెంట్‌లు ఏర్పాటు చేసి వైన్‌షాపులు ప్రారంభించి విక్రయాలకు తెరతీశారు. తాడేపల్లిగూడెంలో నిట్‌కు వెళ్లే మార్గంలో, అలాగే గణపవరం, పెంటపాడు మండలాల మధ్య పరిమెళ్ళ, కొమ్మర రోడ్డుపై వీటిని ఏర్పాటు చేశారు.

సాంకేతికతను అందిపుచ్చుకోవాలి



మాట్లాడుతున్న కలెక్టర్ చదలవాడ నాగరాణి

భీమవరం (ప్రకాశంచౌక్): జిల్లాలోని పట్టణాల్లో సాంకేతికతను ఉపయోగించి మెరుగైన సేవలు అందించేందుకు అవకాశాలను అందిపుచ్చుకోవాలని కలెక్టర్ చదలవాడ నాగరాణి మున్సిపల్ కమిషనర్లకు సూచించారు. శుక్రవారం స్థానిక కలెక్టరేట్ వశిష్ఠ సమావేశ మందిరంలో మున్సిపల్ అధికారులతో వివిధ అంశాలపై సమీక్షించారు. పట్టణాల్లో స్వచ్ఛతకు ప్రాధాన్యత ఇవ్వాలని, పొడి చెత్త, తడి చెత్త వేరు చేసి మాత్రమే చెత్తను సేకరించాలని ఆదేశించారు. జిల్లాలో ఉన్న అన్ని పార్కుల్లో వాకింగ్ ట్రాక్‌లు ఏర్పాటు చేయడంపై దృష్టి సారించాలన్నారు. మున్సిపల్ షాపింగ్ కాంప్లెక్స్ షాపులకు అవసరమైన మరమ్మతులు చేయించి వినియోగంలోనికి తీసుకురావాలన్నారు. పీఎం స్వనిధి రుణాలు మంజూరు చేయించేందుకు కృషి చేయాన్నారు. సమావేశంలో జాయింట్ కలెక్టర్ టి.రాహుల్ కుమార్ రెడ్డి, మున్సిపల్ కమిషనర్లు పాల్గొన్నారు.

పర్యాటకం అభివృద్ధికి చర్యలు : జిల్లాలో పర్యాటకం అభివృద్ధికి అనువైన ప్రదేశాలను గుర్తించి కార్యచరణను సిద్ధం చేయాలని కలెక్టర్ అధికారులను ఆదేశించారు. కలెక్టరేట్‌లో టూరిజం అధికారులతో సమీక్షించారు. పర్యాటకం అభివృద్ధికి తీరప్రాంతంలో చేపట్టాల్సిన ప్రాజెక్టులను గుర్తించాలన్నారు. కార్తీక మాసం సందర్భంగా సముద్ర స్నానాలకు వచ్చే మహిళలు దుస్తులు మార్చుకునేందుకు తాత్కాలిక గదులను ఏర్పాటు చేయాలన్నారు.

దేశాభివృద్ధిలో పరిశోధనలు కీలకం



నిట్‌లో టెక్రియా వేడుకల్లో విద్యార్థులు



ఇస్రో వాహనం వద్ద విద్యార్థులు

తాడేపల్లిగూడెం: దేశ పురోభివృద్ధిలో పరిశోధనల కీలకమని, వినూత్న ఆలోచనలకు విద్యాలయాలు చక్కటి వేదికలని ఏపీ నిట్ రిజిస్ట్రార్ దినేష్ రెడ్డి అన్నారు. నిట్‌లో టెక్రియా 2కె24 వేడుకలో ఆయన మాట్లాడారు. విద్యార్థులే సాంకేతిక సారథులన్నారు. విద్యార్థులు కొత్త కొత్త ఆలోచనలను పరిశోధనలుగా మలిచి దేశం గర్వించే ఆవిష్కరణల రూపకల్పనకు కృషి చేయాలన్నారు. అవకాశాలు, ఉద్యోగాల కోసం విద్యార్థులు ఎదురుచూడకుండా ఉద్యోగాలు సృష్టించే స్థాయికి ఎదగాలని ఆకాంక్షించారు. విద్యార్థులు వేసే ప్రతీ అడుగు విజయానికి మెట్టు కావాలన్నారు. డీన్ రీసెర్చ్, అండ్ కన్సల్టెన్సీ జీఆర్‌కె.శాస్త్రి మాట్లాడుతూ విద్యార్థులు సాంకేతిక యోధులుగా మారాలన్నారు. అధికారులు కురుమయ్య, వీరేష్‌కుమార్ మాట్లాడుతూ విద్యార్థులకు అంతరిక్ష పరిశోధనలపై అవగాహన కోసం టెక్రియా కార్యక్రమాలు ఉపయుక్తంగా ఉంటాయన్నారు. అబ్దుల్ కలాం స్ఫూర్తితో రాకెట్, శాటిలైట్లలో ఉపయోగించే పరికరాల తయారీపై దృష్టి సారించాలన్నారు. నిట్‌లోని క్లబ్‌లు, అసోసియేషన్ల ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి.

ఆకట్టుకున్న ప్రదర్శనలు

నిట్‌లో టెక్రియా 2కె24లో ప్రదర్శనలను శుక్రవారం తిలకించిన విద్యార్థులు అబ్బురపడ్డారు. ఇస్రో వాహనం అమితంగా ఆకట్టుకుంది. సోలార్ శాటిలైట్ వెహికల్, జియో స్టేషనరీ శాటిలైట్ వెహికల్, రాకెట్, ఆర్యభట్ట శాటిలైట్ వంటి పరికరాల గురించి టెక్రియాలో వివరించారు. సోలార్ ప్యానెల్ ఆటను ఆస్వాదించారు.

బాల్య వివాహాలు రూపుమాపాలి

భీమవరం (ప్రకాశంచౌక్): బాల్య వివాహాలు రూపుమాపేందుకు ప్రతి ఒక్కరు కృషి చేయాలని జిల్లా స్త్రీ, సంక్షేమ శాఖ అధికారి బి.సుజాత రాణి అన్నారు. శుక్రవారం భీమవరం ఐఎంఏ హాలులో బాల్య వివాహాలు, హైరిస్క్ ప్రెగ్నెన్సీ, ఎనీమియా తదితర అంశాలపై మెడికల్ అధికారులు, సడీపీఓలు, సూపర్‌వైజర్లతో సమావేశమై సమీక్షించారు. ఈ సందర్భంగా బాల్య వివాహాల నిర్మూలనపై ప్రతిజ్ఞ చేయించారు. స్త్రీ, శిశు సంక్షేమ శాఖ అధికారి సుజాత రాణి మాట్లాడుతూ విద్యార్థినులకు బాల్య వివాహాలపై అవగాహన కల్పించాలన్నారు. డీఎంహెచ్‌ఓ డి.మహేశ్వరరావు మాట్లాడుతూ హై రిస్క్ ప్రెగ్నెన్సీ, రక్తహీనత ఉన్న గర్భవతులను గుర్తించి సరైన పోషకాహారం అందేలా చర్యలు తీసుకోవాలన్నారు. అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా గర్భవతులకు అందించే పౌష్టిక ఆహారం వారు మాత్రమే తీసుకునేలా ప్రోత్సహించాలని సూచించారు. సమావేశంలో జిల్లా ఇమ్యూనికేషన్ అధికారి డాక్టర్ సుధా లక్ష్మి, బాలల సంరక్షణ అధికారి రాజేష్ తదితరులు పాల్గొన్నారు.

డ్రైవర్ రహిత వాహనాలదే భవిష్యత్

నూజివీడు: భవిష్యత్ డ్రైవర్ రహిత వాహనాలదేనని, ఈ పరిస్థితుల్లో యాన్సిస్ సాఫ్ట్‌వేర్‌ను ఉపయోగించి వెహికల్ రూపొందించడం, దానిని విశ్లేషించడంపై వర్క్‌షాపు నిర్వహించడం మెకానికల్ ఇంజినీరింగ్ విద్యార్థులకు ఎంతో ఉపయోగమని ట్రిపుల్ ఐటీ డైరెక్టర్ ఆచార్య సండ్ర అమరేంద్రకుమార్ అన్నారు. స్థానిక ట్రిపుల్ ఐటీలో టిహాన్, ఐఐటీ హైదరాబాద్ సహకారంతో మెకానికల్ ఇంజినీరింగ్ విద్యార్థులకు 'ఆన్సిస్ వర్క్‌షాప్ ఆన్ ఆఫ్ రోడ్ వెహికల్ డిజైన్ అండ్ అనాలసిస్' అంశంపై మూడు రోజుల వర్క్‌షాపును డైరెక్టర్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులకు వర్క్‌షాపులో నిపుణులు వివరించే అంశాలను వింటూ అవగాహన పెంచుకోవాలన్నారు. వర్క్‌షాపునకు కీనోట్ స్పీకర్‌గా ఎన్‌ఐటీ రూర్కేలా నుంచి స్వప్నిల్, బాపట్ల ఇంజినీరింగ్ కాలేజీ నుంచి అసోసియేట్ ప్రొఫెసర్ ఇఫ్తికర్ హుస్సేన్ తదితరులు పాల్గొన్నారు.

మద్యం దుకాణం మార్చాలి



పోలవరం ఎక్సైజ్ సర్కిల్ కార్యాలయంలో వినతిపత్రం సమర్పిస్తున్న మహిళలు

పోలవరం రూరల్: మద్యం షాపును మార్చాలంటూ కొయ్యలగూడెం మండలం పరింపూడి శివారు గ్రామస్తులు పోలవరం ఎక్సైజ్ సర్కిల్ కార్యాలయంలో శుక్రవారం వినతిపత్రం సమర్పించారు. కన్నాపురం రోడ్డులో పాఠశాల, ఆసుపత్రి, చర్చి దగ్గరలో బ్రాందీషాపు ఏర్పాటు చేస్తున్నారని, దీనిని వెంటనే వేరే ప్రాంతానికి మార్చాలని విజ్ఞప్తి చేశారు. ఇళ్లకు సమీపంలో షాపు ఏర్పాటు చేయడం వల్ల ఇబ్బందులు ఎదురవుతాయన్నారు. అధికారులు పరిశీలించి వేరే ప్రదేశానికి షాపును మార్చాలని విజ్ఞప్తిచేశారు.

ఐటీడీఏలో ఇన్‌చార్జుల పాలన

నాలుగు నెలలుగా భర్తీకాని పీఓ పోస్టు



కేఆర్ పురంలోని ఐటీడీఏ కార్యాలయం

బుట్టాయగూడెం: సమగ్ర గిరిజనాభివృద్ధి కోసం ఏర్పాటు చేసిన ఐటీడీఏలో ఇన్‌చార్జుల పాలనతో పరిపాలన పడకేసింది. పాలన విభాగంలో ముఖ్యమైన పీఓ పోస్టు నాలుగు నెలలుగా ఇన్‌చార్జులతోనే నెట్టుకొస్తున్నారు. ఇక్కడ పీఓగా పనిచేస్తున్న ఎం.సూర్యతేజ సాధారణ బదిలీల్లో భాగంగా నెల్లూరు మున్సిపల్ కమిషనర్‌గా వెళ్లారు. అప్పటి నుంచి పీఓ పోస్టు ఇన్‌చార్జులతోనే కొనసాగుతుంది. ప్రస్తుతం ఈ పోస్టులో జాయింట్ కలెక్టర్ ధాత్రిరెడ్డి ఇన్‌చార్జిగా విధులు నిర్వహిస్తున్నారు. ఐటీడీఏలో గిరిజన అభివృద్ధి కోసం ఐఏఎస్ అధికారిని నియమించి పీఓ పోస్టు భర్తీ చేయాలని గిరిజన సంఘాలు కోరుతున్నాయి.

మూడేళ్లుగా భర్తీ కాని డీడీ పోస్టు

కేఆర్‌పురం ఐటీడీఏ పాలనా విభాగంలో మరో ముఖ్యమైన పోస్టు డిప్యూటీ డైరెక్టర్. ఈ పోస్టు గత మూడేళ్లుగా భర్తీకి నోచుకోలేదు. గిరిజన ఆశ్రమ పాఠశాల పర్యవేక్షణ డీడీ ద్వారానే జరుగుతుంది. ప్రతీ పాఠశాలను సందర్శించి గిరిజన విద్యార్థులకు మెరుగైన విద్యను అందించడంలో కీలకపాత్ర పోషించాల్సి ఉంటుంది. ప్రస్తుతం ఈ పోస్టులో ఐటీడీఏ ఏపీఓ పీవీఎస్ నాయుడు ఇన్చార్జిగా ఉన్నారు. అటు ఏపీఓ ఇటు డీడీ పోస్టులు రెండూ కీలకం కావడంతో గిరిజన సంక్షేమ ఆశ్రమ పాఠశాలలు, వసతిగృహాల్లో పర్యవేక్షణ కొరవడి గిరిజన విద్య కుంటుపడే పరిస్థితి నెలకొందని గిరిజన సంఘాలు, విద్యార్థుల తల్లిదండ్రులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా రెగ్యులర్ డీడీ పోస్టును భర్తీ చేసేలా కృషి చేయాలని పలువురు కోరుతున్నారు. కీలకమైన పోస్టులు డిప్యూటీ డీఎం అండ్ హెచ్‌ఓ, పీహెచ్‌ఓలు కూడా ఎంతోకాలంగా భర్తీకి నోచుకోలేదు. ఇన్‌చార్జులతోనే కాలక్షేపం చేస్తున్నారు. ఈ రెండు పోస్టులు భర్తీ చేసి ప్రజలకు ఆయా శాఖల ద్వారా మెరుగైన సేవలు అందించే విధంగా కృషి చేయాలని పలువురు కోరుతున్నారు.

● వరి చేను.. కలువలతో నిండేను



ఇటీవలి భారీ వర్షాలు, వరదలకు ఆకివీడు మాదివాడ ఆయకట్టు నీట మునగడంతో వరి చేలలో ఐదడుగుల ముంపు నీరు నిలిచింది. ఆ నీటిలో కలువలు కనువిందు చేస్తున్నాయి. చూపరులను ఆకట్టుకుంటున్నాయి. అయితే రైతుకు కంట కన్నీరే. కొంత మంది వీటిని పండుగ రోజుల్లో కోసుకెళ్లి అమ్ముకుంటున్నారు. - ఆకివీడు

క్లుప్తంగా

అక్కంపేటలో పేదల ఇళ్ల స్థలం ఆక్రమణ



అక్కంపేటలో పేదలకు కేటాయించిన ఇళ్ల స్థలాన్ని ఆక్రమించిన దృశ్యం

జంగారెడ్డిగూడెం రూరల్: పేదల ఇళ్ల స్థలాన్ని కూటమి నేత ఆక్రమించుకోవడంపై లబ్ధిదారులు భగ్గుమంటున్నారు. ఈ విషయంపై స్థానిక అధికారులు స్పందించకపోవడంతో కలెక్టర్, ఉన్నతాధికారుల దృష్టికి తీసుకువెళ్లేందుకు సిద్ధమవుతున్నారు. గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో జంగారెడ్డిగూడెం మండలం అక్కంపేటలో 40 సెంట్ల భూమిని 24 మంది పేదలకు కేటాయించి ఇళ్ల పట్టాలు పంపిణీ చేశారు. ఈ స్థలం పుంతదారి అంటూ పక్క పొలానికి చెందిన ఒక నాయకుడు కోర్టును ఆశ్రయించాడు. ఇప్పుడు అదే నేత కూటమి ప్రభుత్వం అండ చూసుకొని పేదల ఇళ్ల స్థలాన్ని జేసీబీతో చదును చేయించి తన పొలంలోకి 30 సెంట్ల వరకు కలిపేసుకున్నాడంటూ లబ్ధిదారులు వాపోతున్నారు. రెవెన్యూ అధికారులు స్పందించి చర్యలు చేపట్టాలని వేడుకొంటున్నారు. ఈ విషయంపై వీఆర్‌వో హరిని వివరణ కోరగా ఆక్రమణ విషయం తమ దృష్టికి రాలేదని, పరిశీలిస్తామని తెలిపారు.

చెరువులో పడి యువకుడి మృతి

కొయ్యలగూడెం : చెరువులో పడి యువకుడు మృతి చెందిన ఘటన సరిపల్లి పంచాయతీ పరిధిలోని చోటుచేసుకుంది. వీఆర్‌వో అడపా రాంబాబు తెలిపిన వివరాలి. బుట్టాయిగూడెం మండలం నూతిరామన్నపాలెం గ్రామానికి చెందిన మడకం సురేష్ (30) శుక్రవారం హుకుంపేట చెరువులో చేపల పట్టడానికి వచ్చాడు. ప్రమాదవశాత్తు చెరువులో పడి మృతి చెందాడు. అవివాహితుడైన సురేష్ మృతితో కుటుంబ సభ్యులు కన్నీరుమున్నీరుగా విలపించారు. తండ్రి బజారి వద్ద వాంగ్మూలం తీసుకున్నట్లు వీఆర్‌వో తెలిపారు.

బాణసంచా మందు పేలి ముగ్గురికి గాయాలు

పెదపాడు: ప్రమాదవశాత్తు బాణసంచా మందు పేలడంతో ఓ వ్యక్తికి తీవ్రగాయాలు కాగా మరో ఇద్దరికి స్వల్ప గాయాలయ్యాయి. ఈ ఘటన పెదపాడు మండలంలోని వీరమ్మకుంట గ్రామంలో చోటుచేసుకుంది. వీఆర్వో నర్సింహ తెలిపిన వివరాల ప్రకారం నందివాడ మండలంలోని తుమ్మలపల్లి గ్రామానికి చెందిన కరణికోట పోలు సామర్లకోట ప్రాంతానికి చెందిన మర్రి చిట్టి సత్యబాబు, వీరమ్మకుంట గ్రామానికి చెందిన మేకల సురేష్ దీపావళి పండుగకు ఇంట్లో కాల్చేందుకు సొంతంగా బాణసంచా తయారీ చేసుకునే మందు ఆరబెట్టారు. ప్రమాదవశాత్తూ ఆ మందు పేలడంతో పోలుకు తీవ్రగాయాలు కాగా, సత్యబాబు, సురేష్‌లకు స్వల్ప గాయాలయ్యాయి. పోలును చికిత్స నిమిత్తం విజయవాడకు తరలించారు.

పునాది విద్యను బలోపేతం చేసేలా..

- 1, 2 తరగతులు బోధిస్తున్న 1445 మంది టీచర్లకు రెసిడెన్షియల్ శిక్షణ
- సాల్ట్ ప్రాజెక్ట్‌లో భాగంగా ఎఫ్ఎల్ఎన్ ట్రైనింగ్
- జ్ఞానప్రకాశ్ 60 రోజుల సర్టిఫికెట్ కోర్స్
- రేపటి నుంచి 26వ తేదీ వరకూ తొలిబ్యాచ్
- నాటి వైఎస్సార్ సీపీ సర్కార్ ప్రాజెక్ట్ కొనసాగింపు



జల్లికొమ్మర స్కూల్లో 1వ తరగతి విద్యార్థులకు బోధిస్తున్న రమేష్



బోధిస్తున్న టీచర్

నిడమర్రు: జాతీయ విద్యావిధానం - 2020కి అనుగుణంగా పునాది అభ్యసన ఫలితాల్లో మెరుగుదలకు ఉపాధ్యాయులకు ప్రత్యేక రెసిడెన్షియల్ విధానంలో శిక్షణ ఇచ్చేందుకు ఏర్పాట్లు చేసినట్లు సమగ్రశిక్ష రాష్ట్ర ప్రాజెక్ట్ డైరెక్టర్ బి.శ్రీనివాసరావు ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. ప్రపంచ బ్యాంక్ సాల్ట్ ప్రాజెక్ట్‌లో భాగంగా పునాది అభ్యసన స్థాయిలో బోధించే 1, 2 తరగతుల ఉపాధ్యాయులకు ఫౌండేషనల్ లెటరసీ, న్యూమరసీ (ఎఫ్ఎల్ఎన్) పేరుతో ఈ శిక్షణ ఇవ్వనున్నారు. ఈ శిక్షణకు ఉమ్మడి పశ్చిమ జిల్లాలో 1, 2 తరగతులు బోధిస్తున్న 1445 మంది ఉపాధ్యాయులు 14 స్పెల్స్‌లో హాజరవ్వవలసి ఉంది. స్పెల్‌కి 100 మంది చొప్పున ఈ రెసిడెన్షియల్ ట్రైనింగ్‌కు తప్పనిసరిగా హాజరుకావాలి.

3 ఏళ్లపాటు 60 రోజుల సర్టిఫికెట్ కోర్సు

ఉమ్మడి పశ్చిమ జిల్లాలో 1, 2 తరగతులు బోధిస్తున్న 1445 మంది టీచర్స్‌కు ఏడాదికి 20 రోజుల చొప్పున 3 ఏళ్ల పాటు జ్ఞానప్రకాశ్ 60 రోజుల సర్టిఫికెట్ కోర్సుపై శిక్షణ ఉంటుంది. రాష్ట్ర వ్యాప్తంగా సుమారు 32 వేల మంది 1, 2 తరగతుల బోధిస్తున్న టీచర్స్ ఉన్నట్లు అంచనా. 26 జిల్లాలకు చెందిన వీరందరినీ రెండూ మూడు జిల్లాల చొప్పున 9 కేంద్రాల్లో తొలి ఏడాది శిక్షణకు ఏర్పాట్లు చేశారు. ఎంపిక చేసిన టీచర్లకు ఫస్ట్ స్పెల్‌లో ఈనెల 21 నుంచి 26వ తేదీ వరకూ విజయవాడ లయోలా కళాశాలలో ఎస్-జె సెంటర్ కేంద్రంగా 6 రోజుల రెసిడెన్షియల్ శిక్షణ, అనంతరం 14 రోజులు ఆన్‌లైన్ శిక్షణ ఉంటుంది. ఈ 14 స్పెల్స్ ఫిబ్రవరి-2025 వరకూ కొనసాగాలే మార్గదర్శకాల్లో పేర్కొన్నారు. తొలి 3 స్పెల్స్‌లో ఎక్కువ సంఖ్యలో ఉపాధ్యాయులు ఉన్న స్కూల్ నుంచి శిక్షకులుగా ఎంపిక చేశారు. 4వ స్పెల్ నుంచి మహిళలకు, అనంతరం సింగిల్ టీచర్స్ ఉన్న ఎస్జీటీలను భాగస్వామ్యులుగా ఎంపిక చేస్తారు.

వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలోనే సాల్ట్ ప్రాజెక్ట్‌కు బీజం

ఏపీలో పాఠశాల విద్యను బలోపేతం చేసేందుకు ప్రపంచ బ్యాంక్ ఆర్థిక సహకారంతో 2021 నుంచి సపోర్టింగ్ ఆంధ్రాస్ లెర్నింగ్ ట్రాన్స్‌ఫర్మేషన్ (సాల్ట్) అనే కార్యక్రమం 6 ఏళ్లపాటు నిర్వహించేలా వైఎస్సార్ సీపీ సర్కారులోనే బీజం పడింది. ఈ సాల్ట్ ప్రాజెక్ట్‌లో భాగంగా ఇప్పటి వరకూ వివిధ ఆఫ్‌లైన్, ఆన్‌లైన్ సర్టిఫికెట్ కోర్సుల శిక్షణలు ఉపాధ్యాయులకు ఇచ్చారు. దీని కొనసాగింపులో భాగంగా ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర విద్యా పరిశోధన, శిక్షణ మండలి (ఎస్సీఈఆర్టీ) ఆధ్వర్యంలో ప్రాథమిక స్థాయి పాఠశాలల్లో 1, 2 తరగతులు బోధిస్తున్న ఉపాధ్యాయులకు ఈ వృత్యంతర శిక్షణకు అధికారులు శ్రీకారం చుట్టారు. ఇప్పటికే ఉమ్మడి జిల్లాలోని ప్రధానోపాధ్యాయులకు గతేడాది పాఠశాల నాయకత్వంపై రెసిడెన్షియల్ శిక్షణ పూర్తిచేశారు.

జ్ఞానప్రకాష్ శిక్షణ ప్రధాన లక్ష్యం

జాతీయ విద్యావిధానం ఫ్రేమ్ వర్క్‌లకు అనుగుణంగా విద్యాశాఖ, సమగ్రశిక్ష, ప్రథమం డిపార్ట్‌మెంట్‌ల సహకారంతో ఆఫ్‌లైన్, ఆన్‌లైన్ శిక్షణా పద్ధతుల్లో పునాది స్థాయి (1, 2 తరగతులు) విద్య నాణ్యతలో మెరుగుపరచేలా ఈ కోర్సును ఫ్రేమ్ చేశారు. ఈ జ్ఞానప్రకాష్ 60 రోజుల శిక్షణ ప్రధాన లక్ష్యం సెంకడరీ గ్రేడ్ టీచర్స్ బోధనా నైపుణ్యాలను అభివృద్ధి చేసి ఫౌండేషన్ (పునాది) పాఠశాలలను బలోపేతం చేయడం. ఈ కోర్సులో చిన్నారులకు పునాది స్థాయిలో తెలుగు, ఇంగ్లీషు భాషలపై పట్టు పెంచడం, సంఖ్యాశాస్త్రం బోధనలో మెలకువలకు ప్రాధాన్యత ఇస్తారు. బాల్య సంరక్షణ, విద్య(ఈసీసీఈ)చిన్న వయస్సులోనే అవసరమైన నైపుణ్యాలు పెంపొందించుకునేలా చేయడంలో ఈ శిక్షణ కీలకం కానుందని అధికారులు తెలిపారు.

ఎవరికీ మినహాయింపు లేదు



సమగ్రశిక్ష స్టేట్ అధికారుల ఉత్తర్వుల ప్రకారం జిల్లాలో రాష్ట్ర స్థాయి జాబితాలో ఎంపిక చేసిన 1, 2 వ తరగతులు బోధిస్తున్న టీచర్స్ అందరూ తప్పనిసరిగా శిక్షణకు హాజరుకావాల్సి ఉంటుంది. ఈ జ్ఞానప్రకాష్ సర్టిఫికెట్ కోర్సు శిక్షణకు ఎవరికీ మినహాయింపులేదు. ఇది ఉపాధ్యాయ వృత్తిలో భాగంగా నిర్వహించే రెసిడెన్షియల్ శిక్షణ. జాతీయ విద్యా విధానం-2020 అమల్లో భాగంగా ఈ శిక్షణ ఉంటుంది.

– ఎస్.అబ్రహం, డీఈవో, ఏలూరు

తప్పనిసరిగా హాజరుకావాలి



పునాది స్థాయి విద్య అయిన 1, 2 తరగతుల్లో నాణ్యమైన బోధనా విధానం అమలు చేసి ఫౌండేషన్ స్కూల్స్‌ను బలోపేతం చేసేందుకే ఈ వృత్యంతర శిక్షణ. జాబితాలో ఉన్న టీచర్ ఏదైనా బలమైన కారణం చేత హాజరవ్వకపోయినా తర్వాత స్పెల్స్‌లో తప్పనిసరిగా హాజరవ్వాల్సి ఉంటుంది. ఉదయం 8 నుంచి రాత్రి 8 గంటల వరకూ ప్రత్యేక షెడ్యూల్ ప్రకారం జాయిఫుల్‌గానే ఈ శిక్షణ ఫ్రేమ్ చేశారు.

– సబ్బిత నరసింహమూర్తి, ఎంఈవో, పెదపాడు

తొలిసారి రెసిడెన్షియల్ శిక్షణ



2006 డీఎస్సీలో 2008లో ఎస్జీటీగా జాయిన్ అయిన నాటి నుంచి నేటి వరకూ ఒక్కసారి కూడా రెసిడెన్షియల్ విధానంలో శిక్షణ తీసుకోలేదు. నా 17 ఏళ్ల సర్వీస్‌లో తొలిసారి ఇతర జిల్లాలకు వెళ్లి వృత్యంతర శిక్షణ తీసుకోనున్నాను. సాల్ట్ ప్రాజెక్ట్‌లో భాగంగా ఇప్పటివరకూ ఆన్‌లైన్‌లో నిర్వహించిన ప్రతి సర్టిఫికెట్ కోర్సు చేశారు. 6 రోజులు కుటుంబానికి దూరంగా ఉండటం కొంచెం ఇబ్బందిగానే ఉంటుంది

– ఇంటి రమేష్ బాబు, శిక్షణ భాగస్వామ్య టీచర్

విద్యుదాఘాతానికి గురై వ్యక్తి మృతి

మృతదేహం ఖననాన్ని హిందూ శ్మశాన వాటిక నిర్వాహకులు అడ్డుకోవడంతో వివాదం



హిందూ మోక్ష రుద్రభూమి వద్ద ఆర్డీవో, పోలీసులతో చర్చిస్తున్న బాధితులు

తాడేపల్లిగూడెం అర్బన్ : విద్యుదాఘాతంతో ఎస్సీ క్రైస్తవ వర్గానికి చెందిన ఓ వ్యక్తి మృతి చెందగా.. అతడి మృతదేహాన్ని హిందూ శ్మశాన వాటిక వద్ద ఖననం చేయవద్దని నిర్వాహకులు అడ్డుకున్నారు. దీంతో ఇరువర్గాల మధ్య వాగ్వివాదం చోటుచేసుకుంది. పట్టణ సీఐ సుబ్రహ్మణ్యం తెలిపిన వివరాల ప్రకారం.. పట్టణంలోని 4వ వార్డుకు చెందిన గోగులమండ వరుణ్ సందీప్ (18) తాపీ పని చేస్తుంటాడు. అత్తిలిలో బంధువుల ఇంటి వద్ద తాపీపని చేసేందుకు గురువారం వెళ్లగా అక్కడ ప్రమాదవశాత్తూ విద్యుదాఘాతానికి గురై మృతి చెందాడు. సందీప్ మృతదేహాన్ని గురువారం రాత్రి తాడేపల్లిగూడెం తరలించారు. శుక్రవారం ఉదయం క్రైస్తవ సంప్రదాయ ప్రకారం ఖననం చేసేందుకు 6వ వార్డులోని హిందూ మోక్ష రుద్రభూమికి తరలించి సమీపంలో గుంతను తవ్వుతుండగా రుద్రభూమి నిర్వాహకులు అడ్డుకున్నారు. ఇక్కడ హిందూ సంప్రదాయం పాటించేవారికే అనుమతి ఉందని అనడంతో వాగ్వివాదం నెలకొంది. పట్టణ సీఐ ఎ.సుబ్రహ్మణ్యం ఘటనా స్థలానికి చేరుకుని ఇరువర్గాలతో చర్చించారు. అనంతరం తాడేపల్లిగూడెం ఆర్డీఓ భవానీ శంకర్ వచ్చి ఇరువర్గాలతో మాట్లాడి 11వ వార్డు శివారున ఉన్న పాతూరు శ్మశాన వాటికలో సందీప్ మృతదేహాన్ని ఖననం చేసేందుకు చర్యలు తీసుకున్నారు. దీంతో ఇరువర్గాలు శాంతించాయి. మామిడితోట ప్రాంత వాసులకు సమీపంలో ఎస్సీ క్రైస్తవ శ్మశాన వాటిక ఏర్పాటు చేయాలని ఎస్సీ వర్గీయులు ఆర్డీఓని కోరగా త్వరలో ఏర్పాటు చేస్తామని హామీ ఇచ్చారు. విమానాశ్రయ భూములను పరిశీలించాలని తహసీల్దార్ సునీల్‌కుమార్, ఆర్ఐ శివప్రసాద్‌కు ఆదేశాలిచ్చారు.

చోరీ కేసులో నిందితుడి అరెస్ట్

రూ.1.43 లక్షలు విలువైన 70.47 గ్రాముల బంగారు నగలు స్వాధీనం



విలేకరుల సమావేశంలో కేసు వివరాలు వెల్లడిస్తున్న డీఎస్పీ మురళీకృష్ణ

నరసాపురం: పట్టణంలోని 20వ వార్డు గాంధీ నగర్‌లో ఈనెల 1వ తేదీ రాత్రి జరిగిన చోరీ కేసును పోలీసులు ఛేదించారు. ఈ కేసులో నిందితుడు తూర్పుగోదావరి జిల్లా అమలాపురంనకు చెందిన మండెల నాగభాస్కరరావును అరెస్ట్ చేసి అతని వద్ద నుంచి రూ 1.43 లక్షలు విలువ చేసే 70.47 గ్రాముల బంగారు నగలు స్వాధీనం చేసుకున్నారు. శుక్రవారం నరసాపురం డీఎస్పీ ఎస్‌బీఎం మురళీకృష్ణ తన కార్యాలయంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో నిందితుడిని మీడియా ముందు ప్రవేశపెట్టి వివరాలు వెల్లడించారు. 15 వరకూ దొంగతనాల కేసుల్లో నిందితుడిగా ఉన్న భాస్కరరావు జైలు నుంచి బయటకు వచ్చి కొద్దిరోజులు నరసాపురంలో మకాం వేశాడు. 20వ వార్డులో నివాసం ఉంటూ ఓ ఆసుపత్రిలో నర్స్‌గా పనిచేస్తున్న రవ్వ ఉమామహేశ్వరి ఇంటిపై నిఘా పెట్టాడు. మహేశ్వరి ఒక్కోరోజు నైట్ డ్యూటీల నిమిత్తం ఇంటికి తాళం వేసి వెళ్లడాన్ని గమనించి చోరీకి పాల్పడ్డాడు. సీసీ కెమెరాలు, సెల్‌ఫోన్ సిగ్నల్స్ వంటి సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగించి నిందితుడిని పట్టుకున్నట్లు డీఎస్పీ వివరించారు. ఈ సమావేశంలో టౌన్ సీఐ బి.యాదగిరి, ఎస్సైలు సీహెచ్ జయలక్ష్మి, ముత్యాలరావు పాల్గొన్నారు.

యువజనోత్సవాల్లో ట్రిపుల్ ఐటీ విద్యార్థుల ప్రతిభ



ప్రతిభ కనబరిచిన నూజివీడు ట్రిపుల్ ఐటీ విద్యార్థులు

నూజివీడు: స్థానిక ట్రిపుల్ ఐటీ విద్యార్థులు ఏలూరులో నిర్వహించిన యువజనోత్సవాల్లో ప్రతిభ కనబరిచి పలు విభాగాల్లో ప్రథమ, తృతీయ స్థానాలను సాధించినట్లు ట్రిపుల్ ఐటీ డైరెక్టర్ ఆచార్య సండ్ర అమరేంద్రకుమార్ తెలిపారు. జానపద గీతం బృందం కేటగిరిలో ట్రిపుల్ ఐటీకి చెందిన ప్రశాంత్ బృందం ప్రథమ స్థానంలోను, నవ్యశ్రీ బృందం తృతీయ స్థానంలోను, సోలో విభాగంలో కళ్యాణ్ ప్రథమ స్థానంలో నిలిచారు. అలాగే వక్తృత్వ పోటీలో పద్మజ మూడో స్థానంలో నిలిచారు. ఈ పోటీల్లో ప్రథమ స్థానంలో నిలిచిన విజేతలు రాష్ట్రస్థాయిలో నిర్వహించే యువజనోత్సవాల్లో పాల్గొంటారన్నారు. విద్యార్థులను డైరెక్టర్‌తో పాటు ఏఓ బీ లక్ష్మణరావు, డీన్ అకడమిక్స్ రత్నాకర్, ప్రదర్శన కళల విభాగం హెచ్‌ఓడీ మంగళగిరి శ్రీధర్ అభినందించారు.

తాత్కాలికంగా మద్యం దుకాణం మూసివేత



లింగపాలెంలో మద్యం దుకాణాన్ని తాత్కాలికంగా మూసివేస్తున్న దృశ్యం

లింగపాలెం: లింగపాలెం శివారు బుల్లవారిగూడెం సమీపంలో ఏర్పాటుచేసిన మద్యం దుకాణం నెంబర్ 51ను తాత్కాలికంగా మూసివేస్తున్నట్లు ఎక్సైజ్ సీఐ అశోక్ తెలిపారు. గత రెండు రోజులుగా ఈ ప్రాంతంలో మద్యం దుకాణం పెట్టొద్దంటూ స్థానికులు ఆందోళన కార్యక్రమాలు చేపట్టారు. దీంతో శుక్రవారం చింతలపూడి ఎక్సైజ్ సీఐ అశోక్, ఎస్సై ఖలీల్ ఇక్కడకు వచ్చి పరిస్థితులను పరిశీలించారు. ప్రభుత్వ నిబంధనలకు వ్యతిరేకంగా ఇక్కడ దుకాణం నిర్వహిస్తే సహించబోమని స్థానికులు అధికారుల దృష్టికి తీసుకువెళ్లారు. దీంతో ఈ మద్యం దుకాణంలో తాత్కాలికంగా అమ్మకాలు నిలుపుదల చేస్తున్నట్లు సీఐ చెప్పారు. ఎక్సైజ్ అధికారులు షాపు షట్టర్లను స్వయంగా మూసివేశారు. దీంతో ప్రజలు ఆందోళన విరమించారు.

పోక్సో కేసు నమోదు

భీమడోలు: భీమడోలులో ఓ బాలికపై అత్యాచారానికి పాల్పడిన బాలుడిపై పోక్సో కేసు నమోదైన ఘటన శుక్రవారం ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. భీమడోలుకు చెందిన బాలిక (17)కు, గుణ్ణంపల్లికి చెందిన బాలుడి (18)కి ఇన్‌స్టాగ్రామ్‌లో పరిచయం ఏర్పడింది. భీమడోలులోని ఓ ప్రైవేటు కల్యాణ మండపంలో బాలికపై బాలుడు అత్యాచారానికి పాల్పడ్డాడు. బాధితురాలి తల్లిదండ్రులు భీమడోలు పోలీసులకు ఫిర్యాదు చేశారు. డీఎస్పీ విచారణ చేస్తున్నారని ఎస్సై వై.సుధాకర్ తెలిపారు.

రామాలయంలో చోరీ

ఏలూరు టౌన్: ఏలూరు వన్‌టౌన్ రామకోటి రామాలయంలో చోరీ జరిగింది. సీతమ్మ మెడలోని మంగళసూత్రంతోపాటు 12 గ్రాముల బంగారు నగలు, కేజీన్నర వెండి వస్తువులు, హుండీలోని రూ. 5 వేల నగదును అపహరించారు. సమాచారం అందుకున్న ఏలూరు వన్‌టౌన్ సీఐ జీ.సత్యనారాయణ ఘటనా స్థలానికి వెళ్లి పరిశీలించారు. రామమందిరం నిర్వాహకులు గాదంశెట్టి రమేష్‌కుమార్ చోరీపై పోలీసులకు ఫిర్యాదు చేశారు.

క్లుప్తంగా

రఘురామ్‌ను కలిసిన వైఎస్సార్ సీపీ నాయకులు



వైఎస్సార్‌సీపీ రైతు విభాగం రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ రఘురామ్ నాయుడును కలిసిన నాయకులు

తాడేపల్లిగూడెం రూరల్: తాడేపల్లిగూడెం పట్టణంలో వైఎస్సార్ సీపీ రైతు విభాగం రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ వడ్డి రఘురామ్‌నాయుడును మాధవరం, జట్లపాలెం, మెట్ట ఉప్పరగూడెం గ్రామాలకు చెందిన ఆ పార్టీ నాయకులు శుక్రవారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా పార్టీని ఐకమత్యంగా ముందుకు తీసుకెళ్లాలన్నారు. ఈ కార్యక్రమంలో జెడ్పీటీసీ ముత్యాల ఆంజనేయులు, కొప్పు వెలమ కార్పొరేషన్ మాజీ డైరెక్టర్ గొర్రెల శ్రీనివాస్, ఎమ్పీటీసీ మార్లపూడి సుబ్బారావు, నాయకులు మాకరాజు సతీష్ పాల్గొన్నారు.

వాలీబాల్ పోటీల్లో సత్తా చాటిన కస్తూరి



రాష్ట్ర స్థాయి వాలీబాల్ పోటీలకు ఎంపికైన కొమ్ముగూడెం జెడ్పీహెచ్ విద్యార్థిని కస్తూరి

తాడేపల్లిగూడెం రూరల్: వాలీబాల్ అండర్–17 రాష్ట్ర స్థాయి పోటీలకు మండలంలోని కొమ్ముగూడెం జిల్లా పరిషత్ హైస్కూలు విద్యార్థిని నేదునూరి కస్తూరి ఎంపికై నట్లు స్కూల్ ప్రధానోపాధ్యాయుడు జి.శ్రీనివాసరావు శుక్రవారం తెలిపారు. హిందూపురంలో జరగనున్న రాష్ట్ర స్థాయి పోటీల్లో కస్తూరి పాల్గొంటుందన్నారు. ఈ సందర్భంగా ఆమెను గ్రామసర్పంచ్ తాడేపల్లి బేబి, ఎమ్పీటీసీ సూర్పని రామకృష్ణ, హెచ్‌ఎం శ్రీనివాసరావు, పీడీ కొత్త సుభద్ర, ఉపాధ్యాయులు అభినందించారు.

గొర్రెలకు నట్టల నివారణ మందు



జగ్గన్నపేట గ్రామంలో జీవాలకు నట్టల నివారణ మందు వేస్తున్న దృశ్యం

తాడేపల్లిగూడెం రూరల్: మండలంలోని జగ్గన్నపేట గ్రామంలో శుక్రవారం నట్టల నివారణ మందు పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. మండల పశువైద్యాధికారి డాక్టర్ టి.విజయ్‌కుమార్ పర్యవేక్షణలో 148 గొర్రెలు, 52 మేకలకు నట్టల నివారణ మందు వేశారు. ఇటుకులగుంట, మెట్ట ఉప్పరగూడెం గ్రామాల్లో 600 గొర్రెలు, మేకలకు నట్టల నివారణ మందు వేసినట్లు వెటర్నరీ డాక్టర్ దివ్యశ్రీ తెలిపారు. గ్రామ సర్పంచ్ ములకాల సూర్యారావు, వెటర్నరీ అసిస్టెంట్లు చంద్రశేఖర్, పూర్ణప్రసాద్, పెంపకందారులు పాల్గొన్నారు.

హెల్మెట్ వినియోగంపై అవగాహన



తణుకులో వాహనదారులకు అవగాహన కల్పిస్తున్న ట్రాఫిక్ పోలీసులు

తణుకు: రోడ్డు ప్రమాదాల్లో ఎక్కువ శాతం తలకు గాయాలు కావడం వల్లనే మృత్యువాత పడుతున్నారని తణుకు ట్రాఫిక్ ఎస్‌ఐ బెన్నిరాజు పేర్కొన్నారు. శుక్రావారం తణుకులో ద్విచక్రవాహనదారులు, ఆటో డ్రైవర్లకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఎస్‌ఐ బెన్నిరాజు మాట్లాడుతూ ద్విచక్ర వాహనదారులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని సూచించారు. అలాగే ఆటో డ్రైవర్లు సైతం ట్రాఫిక్ నిబంధనలు పాటించాలని సూచించారు. రద్దీ ప్రాంతాల్లో ఎక్కడ పడితే అక్కడ ఆటోలు నిలపకుండా జాగ్రత్తలు పాటించాలన్నారు. నిబంధనలు ఉల్లంఘిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు.

అత్తిలి రైల్వేస్టేషన్‌లో ప్రయాణికుల అవస్థలు

ఎక్స్‌ప్రెస్ రైళ్ల హాల్ట్‌ను పునరుద్ధరించాలి



అత్తిలి రైల్వేస్టేషన్

అత్తిలి: గతంలో నియోజకవర్గ కేంద్రంగా ఉన్న అత్తిలిలో ఎక్స్‌ప్రెస్ రైళ్లు నిలుపుదల చేయకపోవడంతో ప్రయాణిలు తీవ్ర ఇక్కట్లు పడుతున్నారు. సుదూర ప్రాంతాలు రైలు ప్రయాణం చేసేవారికి అత్తిలి మండల పరిధిలోగల గ్రామాల ప్రజలకు అత్తిలి రైల్వేస్టేషన్ ఎంతగానో ఉపయోగపడేది. గతంలో అత్తిలి రైల్వేస్టేషన్‌లో ఎక్స్‌ప్రెస్ రైళ్లు ఆగేవి. దీంతో హైదరాబాద్, బెంగుళూరు. చెన్నై, తిరుపతి, విశాఖపట్నం, పూరి వంటి పట్టణాలకు అత్తిలి రైల్వేస్టేషన్ నుండి ప్రయాణించేవారు. రైల్వే డబ్లింక్ పనులు చేపట్టిన సందర్భంలో అత్తిలి రైల్వే స్టేషన్‌లో ఎక్స్‌ప్రెస్ రైళ్ల హాల్ట్‌ను తొలగించారు. అయితే రైల్వే లైన్ ఆధునికీకరణ పనులు పూర్తైతే సంవత్సరాలు గడుస్తున్నా అత్తిలి రైల్వే స్టేషన్‌లో ఎక్స్‌ప్రెస్ రైళ్లకు హాల్ట్ పునరుద్ధరించలేదు. దీంతో దూర ప్రాంతాలకు ప్రయాణించే వారు తీవ్ర ఇక్కట్లు పడాల్సివస్తోంది. ఎక్స్‌ప్రెస్ రైలు ఎక్కడానికి అత్తిలి గ్రామానికి 15–20 కిలో మీటర్ల దూరంలో ఉన్న తణుకు, భీమవరం స్టేషన్‌లకు అవస్థలు పడి వెళ్లి రైలు ఎక్కాల్సి వస్తోందని ప్రయాణికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. తణుకు– భీమవరం ఆర్‌అండ్‌బీ రహదారి గోతులతో అధ్వాన్నంగా మారడంతో ఆయా రైల్వేస్టేషన్‌లకు చేరుకోవడానికి ముందుగా బయలుదేరి వెళ్లాల్సివస్తోందని వాపోతున్నారు. తణుకు, భీమవరం స్టేషన్‌లకు చేరుకోవడానికి అదనపు ఖర్చు అవుతోందని చెబుతున్నారు. ఒక్కో సందర్భంలో సరైన సమయానికి చేరుకోలేక ట్రైన్‌లు మిస్సవుతున్నామని ప్రయాణికులు పేర్కొన్నారు. గతంలో మాదిరిగా అత్తిలి రైల్వేస్టేషన్‌లో ఎక్స్‌ప్రెస్ రైళ్లు ఆగేవిధంగా చర్యలు తీసుకోవాలని పలు రాజకీయ పార్టీల నాయకులు, స్వచ్ఛంద సేవా సంస్థలు రైల్వే అధికారులకు, ప్రజా ప్రతినిధులకు వినతిపత్రాలు ఇచ్చినా ఫలితంలేకుండా పోయింది. దక్షిణ మధ్య రైల్వే పరిధిలో విజయవాడ మీదుగా రాకపోకలు సాగించే పలు రైళ్లకు 30 స్టేషన్‌లలో హాల్టులు కల్పించారు. అయితే రైల్వే అధికారులు ప్రకటించిన జాబితాలో అత్తిలి రైల్వే స్టేషన్ లేకపోవడంతో ప్రయాణికులు తీవ్ర నిరాశకు గురయ్యారు. గత మూడేళ్లగా అత్తిలి స్టేషన్‌లో ఏఒక్క ఎక్స్‌ప్రెస్ రైలును నిలుపుదల చేయకపోవడంతో ప్రయాణికులు తీవ్ర ఇక్కట్లు పడుతున్నారు. భీమవరం నుంచి నిడదవోలు వరకు మాత్రమే పాసింజర్ ట్రైన్‌లు పడుపుతున్నారని, దీని వల్ల వివిధ పనులపై రాజమండ్రి వెళ్లే ప్రయాణికులు అవస్థలు పడాల్సి వస్తోందని, నిడదవోలు నుంచి రాజమండ్రి వరకు పాజింజర్ ట్రైన్‌లను పొడిగించాలని ప్రజలు కోరుతున్నారు. గతంలో అత్తిలి వచ్చిన కేంద్ర మంత్రి భూపతిరాజు శ్రీనివాసవర్మ అత్తిలి స్టేషన్‌లో కనీసం ఒక్క ఎక్స్‌ప్రెస్ అయినా నిలుపుదల అయ్యేలా చూస్తానంటూ హామీ ఇచ్చినా ఫలితం లేకుండా పోయిందని ప్రయాణికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

హాల్ట్ పునరుద్ధరించాలి



గతంలో అత్తిలి రైల్వే స్టేషన్‌లో పలు ఎక్స్‌ప్రెస్ రైళ్లు ఆగేవి. దూర ప్రాంతాలకు వెళ్లే అత్తిలి పరిసర గ్రామ ప్రజలకు ఈస్టేషన్ అనువుగా ఉండేది. డబ్లింగ్ పనులు సందర్భంలో ఎక్స్‌ప్రెస్ రైళ్లకు హాల్ట్ రద్దు చేశారు. పనులు పూర్తైనా ఎక్స్‌ప్రెస్ రైళ్లు ఇక్కడ నిలుపుదల చేయడం లేదు. దీంతో తణుకు, భీమవరం ప్రాంతాలకు వ్యయ ప్రయాసలతో వెళ్లి రైలు ఎక్కాల్సివస్తోంది. పాసింజర్ ట్రైన్‌లు రాజమండ్రి వరకు పొడిగించాలి. ప్రయాణికుల ఇబ్బందులను దృష్టిలో పెట్టుకుని ప్రజా ప్రతినిధులు, రైల్వే అధికారులు స్పందించి హాల్ట్‌ను పునరుద్ధరించాలి. లేని పక్షంలో ప్రయాణికుల తరఫున నిరసన దీక్ష చేపడతాం.

– దిరిశాల మునేశ్వరరావు, దిరిశాల సత్యం సేవా సమితి అధ్యక్షుడు, అత్తిలి.

నిబంధనలు అతిక్రమిస్తే చర్యలు తప్పవు

- తణుకులో మూడు తయారీ కేంద్రాలు
- ప్రస్తుతం ఏడుగురికి హోల్‌సేల్ లైసెన్సులు మంజూరు
- తణుకు అగ్నిమాపక అధికారి ఐ.అజయ్‌కుమార్



అగ్నిమాపక అధికారి అజయ్‌కుమార్

తణుకు: రాబోయే దీపావళి పురస్కరించుకుని వ్యాపారులు నిబంధనలు అతిక్రమిస్తే చర్యలు తప్పవని తణుకు అగ్నిమాపక కేంద్రం అధికారి ఐ.అజయ్‌కుమార్ హెచ్చరించారు. ఇప్పటి వరకు తణుకు అగ్నిమాపక కేంద్రం పరిధిలో ఏడుగురికి హోల్‌సేల్ లైసెన్సులు మంజూరు చేసినట్లు చెప్పారు. శుక్రవారం ఆయన ‘సాక్షి’తో మాట్లాడారు. తణుకు మండలం దువ్వ గ్రామంలో రెండు ప్రాంతాలతోపాటు వేల్పూరు గ్రామంలో ఒక ప్రాంతంతో పాటు మొత్తం మూడు చోట్ల కేవలం 600 కిలోల వరకు మాత్రం బాణాసంచా తయారు చేసుకోవడానికి అనుమతులు ఇచ్చామన్నారు. ఆయా ప్రాంతాల్లో నిబంధనలకు విరుద్ధంగా తయారు చేస్తున్నట్లు సమాచారం ఉంటే సబంధిత యజమానులపై క్రిమినల్ కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. హోల్‌సేల్ వ్యాపారులు కచ్చితంగా అగ్నిమాపక శాఖ నిబంధనలకు అనుగుణంగా నడుచుకోవాలన్నారు.

2 లక్షల కిలోల వరకు..

తణుకు అగ్నిమాపక కేంద్రం పరిధిలోని తణుకు, ఇరగవరం మండలాల పరిధిలో మొత్తం ఏడుగురు హోల్‌సేల్ వ్యాపారులకు అనుమతులు జారీ చేసినట్లు చెప్పారు. దువ్వ గ్రామంలో 2 లక్షల కిలోల వరకు బాణసంచా విక్రయించుకునేందుకు అనుమతి ఇవ్వగా 5వేల కిలోలు విక్రయించుకునేందకు ఒకరికి, 1500 కిలోల బాణసంచా విక్రయించుకునేందుకు ఆరుగురికి, 600 కిలోల వరకు విక్రయించుకునేందుకు నలుగురికి అనుమతులు ఇచ్చామన్నారు. రిటైల్ వ్యాపారులకు ఇప్పటి వరకు ఎలాంటి అనుమతులు ఇవ్వలేదని స్పష్టంచేశారు. హోల్‌సేల్ వ్యాపారులు కచ్చితంగా నిబంధనలు పాటించాలని ఆయా గోదాములు, దుకాణాలవద్ద నీరు, ఇసుకతో పాటు మంటలను అదుపు చేసే పరికరాలను అందుబాటులో ఉంచాలన్నారు. రిటైల్ వ్యాపారులు సైతం కచ్చితంగా అనుమతులు తీసుకోవాలని ఇందుకోసం ఎక్కడైనా అనుమతులు లేకుండా బాణాసంచా విక్రయిస్తున్నట్లు తేలితే కఠిన చర్యలు తప్పవన్నారు. ఎక్కడైనా అనుమతులు లేకుండా బాణాసంచా నిల్వ చేసినట్లు సమాచారం ఉంటే ఫైర్, రెవెన్యూ, పోలీసు, మున్సిపల్ అధికారులకు సమాచారం అందించాలని కోరారు. బాణాసంచా విక్రయాలపై అగ్నిమాపక శాఖతోపాటు పోలీసు, రెవెన్యూ, మున్సిపల్ అధికారులు నిత్యం పర్యవేక్షిస్తూ ఉంటారని వెల్లడించారు. నిబంధనలు ఉల్లంఘించి అనుమతులు లేకుండా బాణాసంచా విక్రయించేవారిపై క్రిమినల్ కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. ఇప్పటికే జిల్లా ఉన్నతాధికారులు క్షేత్రస్థాయిలో పరిశీలించారని చెప్పారు. గతంలో లైసెన్సులు ఉండి ప్రస్తుతం రద్దు చేసిన తయారీ కేంద్రాల వద్ద నిఘా ఉంచామని నిబంధనలు ఉల్లంఘిస్తే చర్యలు తీసుకుంటామని అగ్నిమాపక శాఖ అధికారి అజయ్‌కుమార్ స్పష్టం చేశారు.

అధినేతతో భేటీ



మంగళగిరిలో మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డిని కలిసిన మాజీ మంత్రి కారుమూరి, కొల్లేరు నేత మోరు రామరాజు

దెందులూరు: మాజీ ముఖ్యమంత్రి, వైఎస్సార్‌సీపీ అధినేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని శుక్రవారం మంగళగిరిలో ఆయన నివాసంలో రాష్ట్ర మాజీ మంత్రి కారుమూరి నాగేశ్వరరావు, కొల్లేరు నేత మోరు రామరాజు, విజయ్ మర్యాదపూర్వకంగా కలిశారు. మోరు రామరాజు కుటుంబ సభ్యులను వైఎస్ జగన్‌కు మాజీ మంత్రి కారుమూరి పరిచయం చేశారు. ఈ సందర్భంగా మోరు రామరాజు మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం వేధింపులకు గురిచేస్తోందని, అక్రమ కేసులు పెట్టారని వైఎస్ జగన్‌కు వివరించామన్నారు. ధైర్యంగా ఉండాలని పార్టీ అండగా ఆయన భరోసా ఇచ్చారని రామరాజు కుటుంబ సభ్యులు తెలిపారు.

నేడు డయల్ యువర్ డీఎం

తణుకు అర్బన్: ఆర్టీసీ ప్రయాణికుల సౌకర్యార్థం శనివారం ఉదయం 11నుంచి 12గంటలవరకు డయల్ యువర్ డీఎం కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు తణుకు ఆర్టీసీ డిపో మేనేజరు సప్పా గిరిధర్‌కుమార్ తెలిపారు. ప్రయాణికులు, వ్యాపారస్తులు, విద్యార్థు లు, ఉద్యోగులు తమ ప్రయాణాల్లో ఆర్టీసీ ఎక్స్‌ప్రె స్, ప్యాసింజరు బస్సుసర్వీసులపై ఎటువంటి ఫిర్యాదులుకానీ సలహాలు, సూచనలుఉంటే 99592 25484 నంబరులో సంప్రదించాలని కోరారు.

భూ సమస్యల పరిష్కారానికే గ్రామసభలు

తణుకు టౌన్: గ్రామాల్లో భూ సమస్యలు పరిష్కరించడానికే గ్రామసభలు నిర్వహిస్తున్నట్లు తహసీల్దార్ డీవీఎస్ఎస్ అశోక్ వర్మ కోరారు. శుక్రవారం తణుకు రూరల్ మండలం కోనాల గ్రామంలో భూ రీ సర్వేపై నిర్వహించిన గ్రామ రెవెన్యూ సదస్సులో ఆయన మాట్లాడారు. ఈ సందర్భంగా గ్రామంలో భూ రీ సర్వేకు సంబంధించి 63 దరఖాస్తులు అందినట్లు తెలిపారు. వాటిలో భూ విస్తీర్ణంలో తేడాలున్నట్లు 19 దరఖాస్తులు, జాయింట్ ఎల్‌పీఎం మార్పులు కోరుతూ 23 దరఖాస్తులు, కో రిలేషన్‌కు సంబంధించి 5 దరఖాస్తులు, మ్యూటేషన్‌కు సంబంధించి 5 దరఖాస్తులు, ఆధార్ అనుసందానం1 దరఖాస్తులు అందినట్లు తెలిపారు. ఈకార్యక్రమంలో డిప్యూటీ ఇన్‌స్పెక్టర్ ఆఫ్ సర్వేయరు కే నాగభూషణం, రీ సర్వే డిప్యూటీ తహసీల్దార్ పీ గౌతమి, మండల సర్వేయరు దుర్గా ప్రసాద్, వీఆర్‌వో డీ అప్పన్న, ఎంపీటీసీ సత్యనారాయణ, మాజీ సర్పంచ్ బూరుగుపల్లి ఆనంద రమేష్, వివిధ గ్రామాల సచివాలయ సర్వేయర్లు, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

కొమ్ముగూడెంలో గ్రామ సభ

తాడేపల్లిగూడెం రూరల్: మండలంలోని కొమ్ముగూడెం గ్రామంలో శుక్రవారం రీ–సర్వే గ్రామ సభ నిర్వహించారు. ఈ సభలో సర్పంచ్ తాడేపల్లి బేబి మాట్లాడుతూ భూమి సమస్యలను పరిష్కరించుకునేందుకు గ్రామ సభలను వినియోగించుకోవాలని సూచించారు. అనంతరం భూమి సమస్యలపై 43 దరఖాస్తులు అందినట్లు తహసీల్దార్ ఎం.సునీల్ కుమార్ తెలిపారు. రీ–సర్వే డీటీ కాశీకృష్ణ, మండల సర్వేయర్ చక్రవర్తి, వీఆర్వో, పంచాయతీ సిబ్బంది, సర్వేయర్లు పాల్గొన్నారు.

విద్యుత్ చార్జీల పెంపును ఉపసంహరించుకోవాలి

ఇరగవరం: ట్రూఆఫ్ చార్జీల పేరుతో రెండు దఫాలుగా విద్యుత్ చార్జీలు పెంచి, ఆ భారాన్ని ప్రజలపై మోపాలనే నిర్ణయాన్ని ప్రభుత్వం ఉపసంహరించుకోవాలని సీపీఎం మండల కార్యదర్శి కమన మునిస్వామి తెలిపారు. ఇరగవరం మండల కేంద్రంలో మండల సబ్‌స్టేషన్ ముందు సీపీఎం ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించి అధికారులకు వినతిపత్రం అందజేసారు. సీపీఎం సభ్యులు పిల్లి కోటేశ్వరరావు, రామాంజనేయులు, గంగాధరరావు పాల్గొన్నారు.

నీటి నిల్వలను తొలగించాలి



తణుకులో ఫ్రైడే డ్రైడే కార్యక్రమంలో పాల్గొన్న వెంకటేశ్వరరావు, వైద్య ఆరోగ్య సిబ్బంది

తణుకు అర్బన్: వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో ఇండ్ల ఆవరణల్లో నిరుపయోగ నీటి నిల్వలను ఎప్పటికప్పుడు తొలగించుకోవాలని సబ్ యూనిట్ ఆఫీసర్ జి.వెంకటేశ్వరరావు అన్నారు. తణుకు మునిసిపాలిటీ పరిధిలోని 5వ వార్డు ఇందిరా ప్రియదర్శిని మునిసిపల్ ప్రాథమిక పాఠశాల, 29వ వార్డు మల్లికాసుల పేట ప్రాంతాల్లో శుక్రవారం నిర్వహించిన ఫ్రైడే డ్రైడే కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. ఇంటి పరిసరాలు పరిశుభ్రంగా ఉంటే ఇంట్లోని కుటుంబసభ్యులు ఆరోగ్యాలు బాగుంటాయనే విషయాన్ని ప్రజలు గమనించాలని స్పష్టం చేశారు. వారానికోసారి ఇంటి ఆవరణను శుభ్రం చేయడంతో పాటు అవసరం లేని నీటి నిల్వలను తొలగించుకోవాలని సూచించారు. రుబ్బురోళ్లు, రిఫ్రిజిరేటర్స్, మొక్కల కుండీల్లో నీటిని వారానికోసారి శుభ్రం చేసుకోవాలని చెప్పారు. ఈ సందర్భంగా పాఠశాల కిచెన్ రూమ్, డ్రింకింగ్ వాటర్‌ను పరిశీలించారు. పాఠశాల హెచ్‌ఎం డి.కృష్ణవేణి, హెల్త్ అసిస్టెంట్స్ ఎం.శ్రీనివాస్, ఎస్.తాతాజీ, వార్డు హెల్త్ సెక్రటరీలు బి.వెంకటరమణ, కె.అనుషా, సువర్ణ, పి.మాధవి, సీహెచ్ బేబీ వజ్రం, ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు.

గ్రామాల అభివృద్ధికి చర్యలు

పెంటపాడు: గ్రామాల అభివృద్ధికి ప్రత్యేక చర్యలు చేపడుతున్నట్లు ఎమ్మెల్యే బొలిశెట్టి శ్రీనివాస్ పేర్కొన్నారు. పల్లెపండుగ కార్యక్రమంలో భాగంగా విప్పర్రు గ్రామంలో పలు అభివృద్ధి కార్యక్రమాలనుల్లో పాల్గొని మాట్లాడారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ హైమావతి, సర్పంచ్ తెంటు జయలక్ష్మి, పసల అచ్యుతం, పుల్లా బాబి, పసుపులేటి అమ్మిరాజు, గంటా సుబ్రహ్మణ్యం, తదితరులు పాల్గొన్నారు.

బాల్య వివాహాలు చట్టరీత్యా నేరం



తణుకు టౌన్: విద్యార్థులతో ప్రతిజ్ఞ చేస్తున్న దృశ్యం

తాడేపల్లిగూడెం రూరల్: బాల్య వివాహాలు చట్టరీత్యా నేరమని జగన్నాథపురం సర్పంచ్ ఉండ్రాజవరపు చంద్రిక అన్నారు. శుక్రవారం మండలంలోని జగన్నాథపురం గ్రామంలో బాల్య వివాహ నిరోధక చట్టంపై తల్లిదండ్రులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సర్పంచ్ చంద్రిక మాట్లాడుతూ తల్లిదండ్రులు తమ ఆడపిల్లలకు 18ఏళ్ల వయస్సు వచ్చేవరకు వివాహాలు చేయరాదన్నారు. యుక్త వయస్సు రాకుండా వివాహాలుచేయడం వల్ల బాలికల శారీరక సమస్యలు వస్తాయన్నారు. బాలికల ఉన్నత చదువులపై దృష్టి సారించాలన్నారు. అంగన్‌వాడీ కార్యకర్తలు కే.గీత, పి.అంజి కుమారి, ఎం.శాంతకుమారి, టి.రామలక్ష్మి, ఎ.తులసీరాణి, తల్లిదండ్రులు పాల్గొన్నారు. అలాగే, మాధవరం సెక్టార్ పరిధి అప్పారావుపేట, మాధవరం, నవాబుపాలెం, కొత్తూరు, ఆరుగొలను, కృష్ణాయపాలెం, నందమూరు గ్రామాల్లోని అంగన్‌వాడీ కేంద్రాల్లోనూ బాల్య వివాహాల నిరోధక చట్టంపై అవగాహన కార్యక్రమాలు, ర్యాలీలు నిర్వహించారు.

బాల్య వివాహాలను ప్రతి ఒక్కరూ అడ్డుకోవాలి

తణుకు టౌన్: బాల్య వివాహాలను ఆపడానికి ప్రతీ ఒక్కరూ కృషి చేయాలని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ ఎం అరుణ కుమారి కోరారు. శుక్రవారం తణుకు పట్టణంలోని వివిధ అంగన్‌వాడీ కేంద్రాల ఆధ్వర్యంలో నిర్వహించిన అవగాహనా కార్యక్రమంలో ఆయా కేంద్రాల సిబ్బందితో ర్యాలీలు నిర్వహించారు. ఈ సందర్భంగా అరుణ కుమారి మాట్లాడుతూ బాలికలకు 18 ఏళ్లు నిండే వరకూ వివాహాలు చేయవద్దని వివరించారు. అనంతరం కిషోరీ బాలికలు, వారి తల్లులతో ప్రతిజ్ఞ చేయించారు. ఈ కార్యక్రమాలో పోలీస్ సిబ్బంది కే నరశింహరాజు, పట్టణంలోని వివిధ అంగన్‌వాడీ కేంద్రాల కార్యకర్తలు పరమేశ్వరి, తణుకు 3వ నెంబరు మున్సిపల్ పాఠశాల ఆదీనంలో నాలుగు అంగన్‌వాడీ కేంద్రాల కార్యకర్తలు, రత్నకుమారి, పైడిపర్రులోని అంగన్వాడీ కేంద్రాల కార్యకర్తలు ఎస్ వెంకటలక్ష్మి, ఆయా పాఠశాలల హెచ్‌ఎంలు, ఉపాధ్యాయ సిబ్బంది, డ్వాక్రామహిళలు, వైద్య, ఆరోగ్య సిబ్బంది, సచివాలయ సిబ్బంది, మహిళా పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.



తాడేపల్లిగూడెం రూరల్: మహిళలకు చట్టాలపై అవగాహన కల్పిస్తున్న దృశ్యం



అత్తిలి: ఆరవల్లిలో కొవ్వొత్తులతో ర్యాలీ చేస్తున్న దృశ్యం

బాల్యవివాహాలపై అవగాహన సదస్సు

అత్తిలి: బాల్యవివాహాలు చేయడం చట్టరీత్యా నేరమని ఉపసర్పంచ్ వెలగల అమ్మిరెడ్డి అన్నారు.శుక్రవారం అత్తిలి మండలం ఆరవల్లి గ్రామంలో బాల్యవివాహాలు నిరోధక చట్టంపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈసందర్భంగా కొవ్వొత్తులతో ర్యాలీ జరిపారు. బాల్యవివాహాలు చేయడం వల్ల కలిగే అనర్థాలను వివరించారు. కార్యక్రమంలో వార్డు సభ్యుడు సోమిరెడ్డి, కార్యదర్శి మునిరాజ్, అంగన్‌వాడీ కార్యకర్తలు ఉండ్రాజవరపు రాణి, వీఎఎల్ఎస్‌కుమారి, వసంత, రాజేశ్వరి పాల్గొన్నారు.

బలుసులమ్మ ఆలయం వద్ద భారీ అన్న సమారాధన



బలుసులమ్మకు ప్రత్యేక పూజలు చేస్తున్న దృశ్యం

తాడేపల్లిగూడెం (టీఓసీ): దసరా ఉత్సవాలు ముగింపు సందర్భంగా బలుసులమ్మ అమ్మవారి అల యం వద్ద శుక్రవారం విశేష పూజలు జరిగాయి. అనంతరం భారీ అన్నసమారాధ న జరిగింది. దాతలు వంశీకృష్ణ సాయి, శంకర వర ప్రసాద్, కె.కృష్ణ, రామోజు వంశీ చక్రవర్తి, ఎరుబండి వేణుగోపాలరావులు సహకరించారు. ఉత్సవ కమిటీ సభ్యులు శ్రీరంగం అంజిబాబు పర్యవేక్షించారు. భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

ప్రకటన

[illegible] తణుకు సివిల్ జడ్జి (జూనియర్ డివిజన్) వారి కోర్టులో

Succession OP No.2/2024

పిటీషనరు : వెలగల గోపాలరెడ్డి

మరియు

రెస్పాండెంట్లు : వెలగల [illegible]

[illegible] ది.10-09-2021 న execute [illegible] Class-I [illegible] No.AB/COM/MPL/K477026 [illegible] SOP7/2024 [illegible] ది.01-11-2024 [illegible]

// BY ORDER //

ఆర్. వెంకటేశ్వరరావు
ఆర్. ఫణి ప్రకాష్
పిటీషనరు తరుపు న్యాయవాదులు

తణుకు
తేది : 18.10.2024